గౌరవం లేదు.. వేతనం రాదు

- ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానాలు లేవు
- కేవలం మండల సమావేశాలకే పరిమితం
- గౌరవ వేతన విడుదలను విస్మరించిన కూటమి ప్రభుత్వం
- ఎంపీటీసీల ఆవేదన

వేంపల్లె : దేశంలో మొట్టమొదటి పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టిన రాష్ట్రంగా రాజస్థాన్ నిలవగా తర్వాత ఆంధ్రప్రదేశ్ ఉంది. జల్వంతరాయ్ మెహతా కమిటీ సూచనల మేరకు దేశంలో మూడంచెల వ్యవస్థను ప్రవేశపెట్టారు. 1995లో అప్పటి కేంద్ర ప్రభుత్వం స్థానిక సంస్థలను బలోపేతం చేయాలని దిశగా సర్పంచ్‌లతోపాటు ఎంపీటీసీ (మండల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుడు) వ్యవస్థను ప్రవేశపెట్టింది. దీంతో పరిపాలన సజావుగా సాగుతుందని భావించింది. ఈ దశగానే నిధులు కూడా కేటాయించింది. అయితే ప్రస్తుతం కూటమి పాలనలో ఎంపీటీసీల పాత్ర నామమాత్రమైపోయింది. నిధులు రావు.. పనులు కావు అనే సందేహంలో ఎంపీటీసీలు కొట్టుమిట్టాడుతున్నారు. రాష్ట్రంలో కూటమి సర్కార్ ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నా ఎన్నికల హామీలను గాలికి వదిలిన ప్రభుత్వం.. పాలన వ్యవహారాల్లో సైతం ఏకపక్షంగా వ్యవహరిస్తోంది. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను పక్కనపెట్టి కూటమి నేతలకు పెత్తనం అప్పగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీనికితోడు ప్రభుత్వ కార్యక్రమాలకు కనీసం ఆహ్వానం పంపకపోగా వారికి అందాల్సిన వేతనాలను విడుదల చేయకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం

ఎంపీటీసీ సభ్యులకు నిధుల కేటాయింపులు ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. ఫలితంగా గ్రామాల్లో అభివృద్ధి మందగించింది. దీంతో పనులు చేయలేక ముఖం చాటేసుకుంటున్నారు. గతంలో పీఆర్‌జీఎఫ్ ఆర్థిక సంఘం నిధుల్లో 50 శాతం జిల్లా పరిషత్‌కు కేటాయించేవారు. వీటితోనే గ్రామాల్లో అభివృద్ధి పనులను ఎంపీటీసీ సభ్యులు చేసేవారు. అయితే ప్రస్తుతం ఇప్పుడా పరిస్థితి లేదు. 14వ ఆర్థిక సంఘం నిధులను నేరుగా గ్రామ పంచాయతీలకే కేటాయించారు. ప్రస్తుతం పంచాయతీలకు నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రభుత్వాలు ఎంపీటీసీలకు మాత్రం నిధులు కేటాయించడం లేదు.



మండల సర్వసభ్య సమావేశంలో సమస్యలపై అధికారులను నిలదీస్తున్న ఎంపీటీసీ భారతి (ఫైల్)

24 నెలలుగా అందని వేతనాలు

పులివెందుల నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 57 మంది ఎంపీటీసీలు ఉన్నారు. వీరికి ప్రతి నెల రూ.3 వేల ప్రకారం గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రెండు విడతల్లో గౌరవ వేతనాలు చెల్లించారు. సార్వత్రిక ఎన్నికలు రావడంతో మూడో విడత నిధులు మంజూరు చేసే అవకాశం లేకుండా పోయింది. అయితే కూటమి ఏర్పడి ఏడాదిన్నర కావస్తుండటంతో సంబరాలు చేసుకుంటోంది. కానీ తమ గురించి పట్టించుకోవడంలేదని ఎంపీటీసీలు విమర్శిస్తున్నారు. అయితే అధిక శాతం ఎంపీటీసీలు వైఎస్సార్ సీపీకి చెందినవారు కావడంతో ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శలు ఉన్నాయి. ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయకుండా అధికార పార్టీ నాయకులకు ప్రాధాన్యత ఇస్తున్నారని, ఇది కూటమి ప్రభుత్వ మార్కు ప్రజాస్వామ్యమా? అని పలువురు ప్రజాప్రతినిధులు వాపోతున్నారు. ఈ విధానాన్ని పలువురు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

పేరుకు మాత్రమే ఎంపీటీసీలు



మండలంలో పేరుకు మాత్రమే ఎంపీటీసీలుగా ఉన్నాం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ నిధులను నిలిపివేయడంతో గ్రామ సమస్యలను తీర్చలేకపోతున్నాం. ప్రజల చేత ఎన్నుకోబడినప్పటికీ నిధులు మంజూరుకాక దిక్కు తోచని పరిస్థితిలో ఉన్నాం. రెండేళ్లుగా గౌరవ వేతనం అందడం లేదు. తమను సర్వసభ్య సమావేశాలకే పరిమితం చేశారు. అక్కడ కూడా పనుల గురించి మాట్లాడే స్వేచ్ఛ లేదు. మా పరిధిలో ఉన్న సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేదు.

– కటిక చంద్రశేఖర్, ఎంపీటీసీ, వేంపల్లె

గౌరవ వేతనం మంజూరు చేయాలి



కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా మాకు ఇప్పటికీ గౌరవ వేతనం ఇవ్వలేదు. రెండేళ్లుగా గౌరవ వేతనం చెల్లించాల్సి ఉంది. మూడు నెలలకొకసారి మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి వెళ్లడంతప్ప అంతకుమించి గౌరవం కనిపించడంలేదు. చిన్న, చిన్న సమస్యలు చెప్పినా కూడా కూటమి ప్రభుత్వంలో అధికారులు, అధికార పార్టీ నాయకులు స్పందించడం లేదు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గౌరవ వేతనం నిధులు విడుదల చేయాలి.

– వరాలమ్మ, ఎంపీటీసీ, బక్కన్నగారిపల్లె

అర్హులందరికీ పక్కా గృహాలు

కమలాపురం : మున్సిపాలిటీకి చెందిన అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పక్కా గృహాలు మంజూరు చేస్తామని సీఎల్‌టీసీ పి.రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రహ్లాద్‌తో కలసి ఆయన పీఎం ఆవాస్ యోజన యు 2.0 అంగీకర్–2025 పోస్టర్లను ఆయన విడుదల చేసి మాట్లాడారు. ప్రస్తుతం కేవలం పట్టణ ప్రాంత ప్రజల కోసమే కేంద్ర ప్రభుత్వం పీఎం ఆవాస్ యోజన యు 2.0 ప్రవేశపెట్టిందన్నారు. అర్హులైన వారు పక్కా ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ప్రసుత్తం పక్కా ఇళ్లు మంజూరైన వారికి సూర్య ఘర్ కింద సోలార్ యూనిట్ కూడా మంజూరవుతుందన్నారు.

పీఎంఏవై ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

జమ్మలమడుగు : మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన పథకం కింద ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మెప్మా కార్యాలయంలో ఆర్‌పీ, మెప్మా కార్యాలయ సిబ్బందితో కలసి ఆయన పీఎంఏవై 2.0 కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ మహేశ్వర రెడ్డి, పీపీలు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



మన గ్రోమోర్ కేంద్రంలో యూరియా పంపిణీని పరిశీలిస్తున్న విజిలెన్స్ సీఐ శివన్న

కమలాపురం : ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ సీఐ శివన్న హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని మన గ్రోమోర్ కేంద్రంతో పాటు సంబటూరు ఆర్‌ఎస్‌కేలో జరుగుతున్న యూరియా పంపిణీని ఆయన ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతితో కలసి పరిశీలించారు. రైతులందరికీ అవసరమైన మేరకు యూరియా పంపిణీ చేస్తామన్నారు. యూరియాతో పాటు అన్ని రకాల ఎరువులు ఎంఆర్‌పీ ధరకే విక్రయించాలన్నారు. చదిపిరాళ్లలో రైతులకు డీఏపీ ఎరువులను పంపిణీ చేశారు.

విత్తన శుద్ధి తప్పని సరిగా చేయాలి

రబీ సీజన్‌లో పంటలు సాగు చేసే రైతులు సాగుకు 48 గంటల ముందు విత్తన శుద్ధి తప్పని సరిగా చేయాలని ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి తెలిపారు. బుధవారం చదిపిరాళ్ల, రామ చంద్రాపురం గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది.. కార్యక్రమంలో వారు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంటలను పరిశీలించారు. చదిపిరాళ్ల, నల్లింగాయపల్లె ఆర్‌ఎస్‌కేలలో డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయని, కావలసిన రైతులు ఆర్‌ఎస్‌కే సిబ్బందిని సంప్రదించి తీసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

గండిలో టెంకాయల వేలం పాట వాయిదా

వేంపల్లె : చక్రాయపేట మండలంలోని శ్రీ గండి వీరాంజనేయస్వామి దేవస్థానానికి సంబంధించి టెంకాయల వేలంపాట వాయిదా పడినట్లు సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, జిల్లా దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ప్రధాన అర్చకులు కేసరిలు తెలిపారు. బుధవారం వారి ఆధ్వర్యంలో ఈ వేలం పాటలో పాల్గొనేవారు రూ.10 లక్షల ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొన్నారు. బహిరంగ వేలం కాల పరిమితి ఒక సంవత్సరం 01- 11- 25 నుండి 31-10- 26 వరకు వేలంపాట నిర్వహించారు. గత ఏడాది రూ.80 లక్షలు పాట పోవడంతో అక్కడి నుంచే వేలం పాట ప్రారంభించడంతో పాటదారులెవరూ పాట పాడుటకు ముందుకు రాకపోవడంతో దేవస్థాన సహా కమిషనర్ టెంకాయలు వేలంపాట వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తిరిగి మళ్లీ టెండర్లు ఎప్పుడు అనేది పత్రికా ప్రకటన ద్వారా తెలుపుతామన్నారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ ఏఎస్‌ఐ నాగార్జున, బ్యాంక్ అధికారులు చంద్రశేఖర్, సూపరింటెండెంట్ సుభాష్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పార్టీ నాయకులకు సమావేశం

కమలాపురం : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శివరామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఈఆర్‌ఓ నీలమయ్య అధ్యక్షతన నియోజకవర్గంలో జరుగుతున్న స్పెషల్ సమ్మరి రివిజన్, రేషనలైజేషన్ ప్రపోజల్స్ ఇతర ఎన్నికల సంబంధిత విషయంపై రాజకీయ పార్టీల నాయకులతో చర్చించేందుకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గుర్తింపు పొందిన, రిజిస్టర్డ్ అయిన అన్ని రాజకీయ పార్టీల నాయకులు సమావేశానికి హాజరు కావాలని ఆయన తెలిపారు.

విశ్వకర్మ జయంతి వేడుకలు

ఎర్రగుంట్ల : ఆర్టీపీపీలో ఆంధ్ర రాష్ట్ర పవర్ ఎంప్లాయీ యూనియన్(బీఎంఎస్) కార్యాలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలను బుధవారం యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రామగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. విశ్వకర్మ దినోత్సవంను నేషనల్ కార్మిక దినోత్సవంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని కోరారు.

సదస్సు బహిష్కరణ




గ్రామదర్శినిని బహిష్కరిస్తున్న రైతులు

వేంపల్లె : రెవెన్యూ అధికారులు రామిరెడ్డిపల్లెలో చేపట్టిన గ్రామదర్శిని సదస్సును రైతులు బహిష్కరించారు. బుధవారం రామిరెడ్డిపల్లెలోని గ్రామ సచివాలయంలో రెవెన్యూ అధికారులు నిర్వహించిన గ్రామదర్శిని సదస్సుకు హాజరైన రైతులు తహసీల్దార్‌పై విరుచుకుపడ్డారు. గ్రామానికి చెందిన రెవెన్యూ సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులు బయటికి వెళ్లి పోవాలని రైతులు ఆందోళన చేశారు. తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బందిని గ్రామ సచివాలయం నుంచి రైతులు బయటికి పంపించారు. సచివాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు.

పరిశుభ్రత.. పౌరుల బాధ్యత

కమలాపురం : పరిశుభ్రత పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని కమలాపురం మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద తెలిపారు. బుధవారం స్వచ్ఛతా హీ సేవా–2025లో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్, మెప్మా సిబ్బందితో కలసి ఆయన మానవహారం ఏర్పాటు చేసి మాట్లాడారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన పచ్చదనం కోసం దేశం యొక్క సంకల్పాన్ని ప్రదర్శించడానికి దేశ వ్యాప్తంగా పౌరులు శ్రమదానం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

తిరుమలలో పార్నపల్లి వాసి మృతి



ఆదాల వెంకటన్న మృతదేహం

లింగాల : మండలంలోని పార్నపల్లెకు చెందిన ఆదాల వెంకటన్న(61) తిరుమలలో మృతి చెందాడు. ఆయన మంగళవారం తిరుమలకు వెళ్ళి వైకుంఠం నిలయంలో బస చేసినట్లు సమాచారం. ఆయన ఒక్కడే గది తలుపులు వేసుకుని బాత్రూంలోకి స్నానానికి వెళ్లినట్లు తెలిసింది. ఆయన గదిని ఎంతటికి తెరవకపోవడంతో సిబ్బంది గది తలుపులు తెరిచి చూడగా ఆయన మృతి చెందినట్లు గుర్తించారు. అధికారులు ఆయన మృతిని నిర్ధారించి విషయాన్ని పార్నపల్లెలోని వారి బంధువులకు తెలిపారు. వైకుంఠ నిలయంలోని బాత్రూంలో షార్ట్ సర్క్యూట్ అవడం వల్ల మృతి చెందినట్లు వారి బంధువులు ఆరోపిస్తున్నారు. ఆయన భార్య పది సంవత్సరాల క్రితమే మృతి చెందింది. ఆయనకు ముగ్గురు కుమార్తెలు వారికి వివాహాలు అయ్యాయి. ఆయనకున్న కొంత పొలాన్ని కౌలుకిచ్చి సొంత ఇంటిని కూడా బాడుగకు ఇచ్చి కూతుర్ల వద్ద ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లి ఆకస్మిక మృతిచెందడంతో పార్నపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రేపు ప్రముఖ వైద్య నిపుణురాలు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణురాలు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణరాలు డాక్టర్ శుక్రవారం ఉదయం 11.45గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలవరకు సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు సలిపిరి, తల్లి (అమ్మవారు), సభ్యం(శోభి), మాగురు(మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పెను కొరుకుట, జుట్టు వ్రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్ఠు, తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఇ-క్రాప్ తప్పనిసరిగా చేయించుకోండి

వేముల : సాగు చేసిన పంటలకు తప్పనిసరిగా ఇ-క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ ఓబులేసు రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని గుండ్లపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో రైతులతో మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి పంటకు ఇ-క్రాప్ చేసుకున్నట్లయితే నష్టపరిహారం, పంటల బీమా వర్తిస్తాయన్నారు. పంటలకు యూరియ వాడకాన్ని తగినంత మోతాదులో వాడాలన్నారు. సూచించిన మేరకే ప్రతి పంటకు ఎరువులు వాడాలన్నారు. ఎర్ర నేలల రైతులు కంది పంటను సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ సురేష్, వీఏఏ సంతోష్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

రక్తహీనతకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్, ఐసీడీఎస్ సిబ్బంది

లింగాల : గర్భిణులు, బాలింతలు, కిశోర్ బాలికలు రక్తహీనతకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ ప్రసన్నకుమార్ తెలిపారు. బుధవారం బోనాల గ్రామ సచివాలయంలో రాష్ట్రీయ పోషన్ మాస కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మీదేవి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ సెంటర్ నుంచి తీసుకెళ్లిన పౌష్టికాహారాన్ని ఇంట్లో వాళ్లకు పంచకుండా మీరు మాత్రమే తీసుకుని రక్తహీనత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ముద్దనూరు స్టేషన్‌లో రైళ్లను ఆపాలి



ముద్దనూరు రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లను ఆపాలని ఎంపీకి వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల : భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని ముద్దనూరుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీధర్‌రెడ్డితోపాటు కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారు ఎంపీతో కరోనాకు ముందు ముద్దనూరు రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లు ఆపేవారని, కరోనా తర్వాత వాటిని రద్దు చేశారన్నారు. గతంలో ఎగ్మోర్ రైలు సర్వీస్‌తోపాటు విజయవాడ టు మచిలీపట్నం రైలుతోపాటు చెన్నై టు ముంబాయి సబర్మతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపేవని, ఇప్పుడు ఆ రైళ్లు ఏవీ ఆగడం లేదన్నారు. దీనికి ఎంపీ రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అలాగే ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని మల్లేలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లేల రవీంద్రనాథరెడ్డితోపాటు కొంతమంది రైతులు కలిశారు. ఇటీవల నిర్మాణం చేపట్టిన నేషనల్ హైవే వల్ల మెయిన్ రోడ్డుకు ఇరువైపులా తమ పొలాల కోసం వేసుకున్న పైపులైన్లు రోడ్డుకు పోతున్నాయని అందుకు సంబంధించి తమకు నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు. దీనికి ఎంపీ నేషనల్ హైవే ఈఈకి ఫోన్ చేసి రోడ్డు నిర్మాణాలవల్ల నష్టపోతున్న రైతులకు నష్టపరిహారం అందించాలని సూచించారు.

నేటినుంచి వైద్యశిబిరాలు

ముద్దనూరు : స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ అనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యక్రమం ద్వారా ఈనెల 18వ తేదీ గురువారం నుంచి 29 వరకు మండలంలోని అన్ని విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లలో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు కరిష్మా, శ్రీకాంత్‌లు బుధవారం తెలిపారు. 18న శెట్టివారిపల్లె, 19న కొలవలి, 20న తిమ్మాపురం, 22న పెనికలపాడు-1లో, 23న పెనికలపాడు-2లో, 24న నల్లబల్లె, 25న కొర్రపాడు, 26న బొందలకుంట, 27న ఉప్పలూరు, 29న యామవరంలలో, 22న ముద్దనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యం వద్దు

పులివెందుల టౌన్ : ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పారిశుధ్య కార్మికులకు సూచించారు. బుధవారం స్థానిక భాకరాపురంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో స్వచ్ఛతహిసేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపును ఆయన సందర్శించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు.

సమస్యలను పరిష్కరించాలని ఆందోళన

ఎర్రగుంట్ల : వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టి అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్మికుల కుటుంబాలకు బీమా అందించి తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పౌష్టికాహారంపై అవగాహన

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక బాకరాపురం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో బుధవారం రాష్ట్రీయ పోషణ మాసోత్సవంలో భాగంగా పౌష్టికాహార అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ రాముడు చేతులమీదుగా చిన్నపిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సీడీపీఓ సునీత పౌష్టికాహారంపై ప్రతిజ్ఞ చేయించారు.

అంతరిక్ష పరిశోధనలు దేశాభివృద్ధికి పునాది

వేంపల్లె : అంతరిక్ష పరిశోధనలు దేశాభివృద్ధికి పునాది లాంటిదని కళాశాల ప్రిన్సిపల్ ఎస్.నాగేంద్ర అన్నారు. బుధవారం వేంపల్లెలోని స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రధాని మోడీ జన్మదినం సందర్భంగా అంతరిక్ష విప్లవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

స్థల వివాదం పరిష్కారం

లింగాల : కొన్నేళ్లుగా ఉన్న ఎగువపల్లె ప్రాథమిక పాఠశాల స్థల వివాదం పరిష్కారమైంది. బుధవారం ఎగువపల్లె ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వచ్చిన శివశకుంతలమ్మ సమావేశం నిర్వహించి గ్రామస్తుల సహకారంతో ఎమ్మార్సీ సిబ్బంది ప్రోద్బలంతో కె.శివారెడ్డి స్థలాన్ని రూ.25వేలకు ఇవ్వడానికి అంగీకారం తెలియజేస్తూ హామీ పత్రం ఇచ్చారు. దీంతో పాఠశాల నూతన భవన నిర్మాణానికి మార్గం సుగమమైంది.

సమ్మె బాటలోకి పారిశుద్ధ్య సిబ్బంది

వేంపల్లె : పారిశుద్ధ్య కార్మికులందరికి కొత్త ఈఓ వచ్చిన వెంటనే 6నెలల జీతాలను వారి బ్యాంకు అకౌంట్‌లోకి వేస్తామని డీపీఓ రాజ్యలక్ష్మి ప్రగల్భాలు పలికింది. ఆమె చెప్పిన మాటలను నమ్మి పారిశుద్ధ్య సిబ్బంది విధుల్లోకి చేరారు. డీపీఓ వేంపల్లెకు కొత్త ఈఓను వేయడం కూడా 7 రోజులైంది. కాని ఇంత వరకు జీతాలు వేయలేదు. కొత్త ఈఓ వచ్చిన తర్వాత కూడా ఆశలు ఆడి ఆశలయ్యాయి. దీంతో బుధవారం నుంచి మళ్లీ సమ్మెలోకి వెళ్లుతున్నట్లు పారిశుద్ధ్య కార్మికులు తెలిపారు. జీతాలు చెల్లించి కార్మికులు సమ్మెలోకి వెళ్లకుండా చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ నిమ్మకు నీరెత్తుతున్నట్లు వ్యవహరిస్తున్నారు. కలెక్టర్, డీపీఓ స్పందించి తమ జీతాలను వెంటనే చెల్లించాలని కోరారు.

మూడవ రోజుకు చేరిన నిరసన



ఆందోళన చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు

ఎర్రగుంట్ల : విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని జేఏసీ నేతలు ధ్వజమెత్తారు. బుధవారం ఆర్టీపీపీలోని ప్రధాన గేటు వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్నా మూడవ రోజుకు చేరింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సార్లు సమావేశాలు జరిపి సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రాలు సమర్పించినా ఇప్పటి వరకు ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదన్నారు.

ఆరోగ్య సేవలను బలోపేతం చేయడమే లక్ష్యం

చింతకొమ్మదిన్నె : స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ అనే కార్యక్రమాన్ని బుధవారం జిల్లా వైద్యాధికారులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. వివిధ విభాగాల ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు, జిల్లా ఎపిడమియాలజిస్ట్ ఖాజా, సహాయ మలేరియా అధికారి వెంకటరెడ్డిలు శిబిరం నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమ పర్యవేక్షణను రాష్ట్ర ప్రతినిధులు డాక్టర్. పెంచలయ్య, డాక్టర్ సుప్రీతలు ఆకస్మిక తనిఖీ నిర్వహించి, రాష్ట్ర కార్యాలయానికి నివేదిక పంపనున్నారు. ఈ సందర్భంగా జిల్లా స్టాస్టికల్ అధికారి రమేష్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ బాలాంజనేయులు, జిల్లా ఆరోగ్య పర్యవేక్షకులు రాఘవ, రాష్ట్ర ప్రతినిధులను అనుసరించి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. శిబిరంలో దాదాపు 243 మందికి వివిధ ఆరోగ్య వైద్య సేవలు అందించామన్నారు. కార్యక్రమంలో స్త్రీ శిశుసంక్షేమశాఖ పర్యవేక్షకులు శ్రీదేవి, లక్ష్మీదేవి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : నల్లపురెడ్డిపల్లెలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రజలకు హెచ్‌ఐవీ/ఎయిడ్స్, దోమకాటువల్ల వచ్చే వ్యాధుల గురించి, టీబీ, హైపటైటిస్ గురించి, క్యాన్సర్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ బాలాజి, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య, ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య, సీడీఎస్ ప్రాజెక్టు మేనేజర్ వల్లి, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, సీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

తొండూరులో...

తొండూరు : జబ్బులు వచ్చిన తర్వాత చికిత్స తీసుకునే కంటే.. జబ్బులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం చాలా ఉత్తమమని పీహెచ్‌సీ డాక్టర్ అరివుల్లా తెలిపారు. బుధవారం మడూరు గ్రామంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ అవగాహన కార్యక్రమంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోపాల్, సీహెచ్‌ఓ విజయ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమణమ్మ, ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో

వేంపల్లె : మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తాళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పృధ్వీ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక రాజీవ్ నగర్ కాలనీలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వైద్యం, ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీహెచ్‌ఈఓ షఫిఉన్నిషా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, పీహెచ్‌సీ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.